సభ నుంచి వాకౌట్



తమను అగౌరవపరిచారంటున్న ఎంపీటీసీ రామనారాయణరెడ్డి



సమావేశాన్ని వాకౌట్ చేస్తున్న ఎంపీపీ

- ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకపోడటంపై వైఎస్సార్ సీపీ సభ్యుల ఆగ్రహం

కొనకనమిట్ల:

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన ప్రభుత్వ కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను పిలవకుండా తమను అగౌరపరిచారని సభ్యులు సమావేశాన్ని వాకౌట్ చేసి వెళ్లారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన ఎంపీడీఓ సుగుణమ్మ నిర్వహించారు. ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ సభ్యులు అక్కిదాసరి ఏడుకొండలు, గొట్లగట్టు ఎంపీటీసీ సభ్యులు ఉడుముల రామనారాయణరెడ్డిలు.. అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 73వ రాజ్యాంగం సవరణ ద్వారా పింఛన్లు పంపిణీ అంశం మండల పరిషత్‌కు అప్పజెప్పారని కానీ అలా కాకుండా ఈ నెల 1న పింఛన్ల పంపిణీ పంచాయతీ కార్యదర్శులు వారి ఇష్టారీతిన పంపిణీ చేశారన్నారు. సర్పంచ్, ఎంపీటీసీలకు ఆహ్వానం లేకుండా అర్హతలేని వారిచే పింఛన్లు ఎలా పంపిణీ చేస్తారని నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సచివాలయాల శిలాఫలకాలు ధ్వంసం చేయడం, టీడీపీ జెండాలు కట్టడం వంటివి చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. తాము ఎస్పీకి చెప్పిన తరువాత చినమనగుండం సచివాలయంపై దాడులు చేసిన వారిపై కేసు కట్టారని వివరించారు. గరిమినపెంట కార్యదర్శి తను ఇష్టారాజ్యంగా సచివాలయ శిలాఫలకాలపై రంగులు పూసి పేర్లు, ఫొటోలు చెరిపివేశారని ఆయనపై చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. కాట్రగుంటలో టీడీపీకి చెందిన సర్పంచ్ శిలాఫలకాన్ని తొలగించి తమ పేర్లు వేసుకొని మళ్లీ అదేస్థానంలో కొత్త శిలాఫలకం ఏర్పాటు చేశారని చెప్పారు. వీటన్నింటికీ నిరసనగా మండల సమావేశాన్ని వాకౌట్ చేస్తున్నట్లు ఎంపీపీ మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీలు మెట్టు వెంకటరెడ్డి, గొంగటి జెనీ ఫాలతో పాటు సభ్యులు ప్రకటించి సభ నుంచి వెళ్లిపోయారు. అయితే సందట్లో సడేమియా అనుకున్న పలు శాఖలకు చెందిన అధికారులు సమావేశం జరిగితే తమశాఖలపై సమీక్ష తీవ్రంగా ఉండేదనుకున్నారు. కానీ సమావేశం జరపకపోడంపై వారు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ మూడు నెలల వరకు ఇబ్బంది ఏమిలేదనుకుంటూ వెళ్లిపోవడం కనిపించింది. ముందుగా పలు అంశాలపై జరిగిన తీర్మానాలను మండల సమావేశం ఏకగ్రీంగా ఆమోదించింది.



సభ్యుల ప్రశ్నకు సమాధానం చెప్తున్న ఎంపీడీఓ

పోలీసుల పహారా నడుమ చెత్త తొలగింపు



జేసీబీతో చెత్తను తీయిస్తున్న ఎస్సై మధుసూదన్‌రావు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన కార్మికులు

- పారిశుధ్య కార్మికులు, అధికారులకు మధ్య వాగ్వాదం
- విధులకు హాజరయ్యేది లేదని తేల్చి చెప్పిన కార్మికులు

కొమరోలు: తమ 20 నెలల జీతభత్యాలు చెల్లించాలంటూ విధులకు హాజరు కాకుండా పారిశుధ్య కార్మికులు 20 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. చెత్త సేకరించక పోవడంతో కొమరోలులోని 4 రోడ్ల కూడలి వద్ద చెత్తాచెదారం కుప్పలు తెప్పలుగా ఉంది. శనివారం స్థానిక ఎంపీడీఓ నరసింహారావు ఆధ్వర్యంలో ఇతరులతో జేసీబీ సాయంతో ట్రాక్టర్లలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. చెత్తను తీసే క్రమంలో అక్కడికి పారిశుధ్య కార్మికులు చేరుకుని అడ్డుకున్నారు. స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పారిశుధ్య కార్మికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కొద్ది సేపు పారిశుధ్య కార్మికులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రావు మాట్లాడుతూ పట్టణంలో రహదారి పక్కనే చెత్త ఎక్కువగా ఉండటంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, తమ సమస్యలు కలెక్టర్‌కు తెలపాలని నచ్చజెప్పి అక్కడున్న చెత్తను జేసీబీ సాయంతో తీయించారు.

సచివాలయం ఎదుట నిరసన

తమ వేతనాలు చెల్లించాలంటూ కొమరోలులోని గ్రామ సచివాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ కొమరోలు గ్రామ పంచాయతీలో సర్పంచ్ అందుబాటులో ఉండటం లేదని, సర్పంచ్ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సర్పంచ్ అందుబాటులో ఉండి సమస్యలను పట్టించుకోవాలని, లేదా అధికారులు చొరవ తీసుకుని గ్రామ సర్పంచ్‌పై చర్యలు తీసుకుని తమ జీతభత్యాలు చెల్లించే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కేజీబీవీలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



లింగారెడ్డి కాలనీలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. శనివారం గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, జెడ్పీ పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మిల పర్యవేక్షణలో ఎకో క్లబ్స్ మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

తర్లుపాడు: లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మౌలాలీ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మౌలాలీ మాట్లాడుతూ మొక్కలు నాటడం, శక్తి ఆదా, వ్యర్థాలను తొలగించుట, నీటి పొదుపు తదితర విషయాలు వారికి వివరించారు. చెట్లను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షెక్షావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం జనరల్ పాఠశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం షేక్ ఖలీమాభాను విద్యార్థుల తల్లులచే మొక్కలు నాటించారు. శనివారం శిక్షసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని తెలిపారు. ఉపాధ్యాయులు వినుకొండ రాజేష్, వెంకటేశ్వర్లు, పిచ్చయ్య, భ్రమరాంబదేవి పాల్గొన్నారు.



మొక్కలు నాటిస్తున్న హెచ్ఎం ఖలీమాభాను, ఉపాధ్యాయులు

క్షుద్ర పూజల కలకలం



వెలుగొండ కాలువ పక్కన క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు

రాచర్ల: మండల కేంద్రం రాచర్ల నుంచి అనుమలవీడు గ్రామానికి వెళ్లే దారిలోని వెలుగొండ ప్రాజెక్టు కాలువ పక్కన అగంతకులు ముగ్గులు వేసి పసుపు, కుంకుమ, బొగ్గు, నిమ్మకాయలతో క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు గుర్తించారు. ఆ దారిలో ప్రతి నిత్యం రైతులు, విద్యార్థులు తిరిగే ప్రదేశం కావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. నివాస గృహాల సమీపంలో ఇలాంటి క్షుద్రపూజలు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం అందించినట్లు సమాచారం.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



మాట్లాడుతున్న డాక్టర్ బాలయ్య

కొనకనమిట్ల: సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఎస్సీ బాలయ్య అన్నారు. శనివారం రేగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు సూచనలు చేశారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా వంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. భోజనానికి ముందు, తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని.. కాచి చల్లార్చిన నీరు, వేడి పదార్థాలు తీసుకోవాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు. హెచ్ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రశంసపత్రాల అందజేత



ప్రశంసపత్రం అందజేస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

కంభం: పేదవిద్యార్థుల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామ్‌భూపాల్‌రెడ్డి అభినందనీయుడని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ జయ అన్నారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరంలో ప్రథమ ర్యాంకులు సాధించిన జిల్లాలోని గురుకుల పాఠశాలల విద్యార్థినులకు శనివారం స్థానిక అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు. ప్రధానమంత్రి నుంచి ప్రశంసలు పొంది అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

రాచర్ల: పాఠశాలల్లో రికార్డులు సక్రమంగా ఉండాలని ఎంఈవో-2 వారణాసి గిరిధర్ శర్మ అన్నారు. మండలంలోని ఒద్దులవాగుపల్లె ఎయిడెడ్ పాఠశాలలను గుంటూరు ఆర్‌జేడీ, డీఈవో ఉత్తర్వుల మేరకు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈవో-1 శివకోటేశ్వరరావు, రాచర్ల, అనుమలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీఎల్ రామనాయక్, ఎం.బాలరాజులు బృందంగా ఏర్పాడి ఒద్దులవాగుపల్లె ఎయిడెడ్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పాఠశాలలకు సంబంధించిన రికార్డులతో పాటు తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్యను పరిశీలించారు. స్కూల్ కిట్సు పంపిణీ, స్కూల్‌కు సంబంధించిన అన్ని రకాల రికార్డులను పరిశీలించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో గిరిధర్‌శర్మ

బోరు నుంచి నీరు వృథా



బోరు వద్ద వృథాగా పోతున్న నీరు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజానగర్‌లో బోరు నుంచి వచ్చే పైపు లీకు అవడంతో నీరు నిత్యం వృథా అవుతోంది. బోరు నుంచి పక్కనే ఉన్న మినీ ట్యాంకుకు నీరు సరఫరా చేయాల్సి ఉంటుంది. దీంతో బోరు నుంచి నీరు వచ్చే ప్రధాన పైపు ఊడి పోవడంతో బోరు వేసిన సమయంలో నీరు ట్యాంకులోకి వెళ్లకుండా వృథాగా రోడ్డు మీదకు వస్తోంది. నిత్యం బోరు నుంచి వచ్చే వృథా నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకులోకి నీరు ఎక్కక పోవడంతో స్థానికుల నీటి సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరు పైపు లీకేజీని బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

యుద్ధ వీరునికి కలెక్టర్ సత్కారం



జాన్సన్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం టౌన్: కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుడు మందా జాన్సన్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ జమ్మూలోని కార్గిల్ సెక్టార్‌లో ఉన్న డ్రాస్‌లో తనతోపాటు వీరయ్య, మరో ముగ్గురు మొత్తం 5 మంది 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఆనాటి యుద్ధం జరిగిన తీరు జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమను గుర్తించి సన్మానించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా మందా జాన్సన్ ప్రస్తుతం స్థానిక ఆకాశవాణి కేంద్రంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న రామయ్య, పక్కన చంద్రశేఖర్‌రెడ్డి

మార్కాపురం: మత్తుపదార్థాలు వాడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని ప్రముఖ న్యాయవాది కడియాల రామయ్య, జెడ్పీ హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండల న్యాయసేవాధికర సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మత్తుపదార్థాలు వాడినా, అమ్మినా, కొనుగోలు చేసినా చట్టప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చి మంచి భవిష్యత్తుకు పాఠశాల స్థాయిలో పునాదులు వేసుకోవాలన్నారు. సంస్థ ప్రతినిధి అనీల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లతో విద్యార్థినులు

పొదిలి: స్థానిక శ్రీవివేకానంద విద్యా సంస్థల్లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), నాంది ఫౌండేషన్ సంయుక్తంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించారు. ట్రాన్స్‌ఫరబుల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్, ఇంటర్వ్యూ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌పై 43 మంది విద్యార్థినిలకు తరగతులు జరిగాయి. శనివారం వీరికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కోర్సు మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రాం నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి జె.రవితేజ ముఖ్య అతిథిగా మాట్లాడారు. నైపుణ్యంలో శిక్షణ పొందటం ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుత కంపెనీలకు ఆధునిక సాంకేతిక నైపుణ్యం అవసరమైనందున ఆదిశగా శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమని శిక్షణ ఇచ్చామన్నారు. డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణ పొందిన విద్యార్థినిలకు మంచి భవిష్యత్ ఉందన్నారు. నాంది ఫౌండేషన్ ట్రైనర్ ఆయేషా, కె.సాయి ప్రణీత, ప్రిన్సిపాల్ బోసం శ్రీనివాసరెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం స్ఫూర్తి ప్రదాత



అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న జగన్‌బాబు, ఉపాధ్యాయులు అబ్దుల్ షుకూర్



అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రాజబాబు, మస్తానయ్య

మార్కాపురం: మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం మహనీయుడని నేటి యువతకు స్ఫూర్తినిచ్చారని జార్జి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య అన్నారు. శనివారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కళాశాలలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. భారత అణు వైజ్ఞానిక రంగాన్ని, క్షిపణుల పరిజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం అన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ సురేష్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం నిర్వహించారు. లింగారెడ్డి కాలనీ హెచ్ఎం మౌలాలి కలాం గొప్పదనం గురించి వివరించారు. లక్ష్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కె. జగన్‌బాబు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంభం: ఏపీజే అబ్దుల్ కలాం జీవితం విద్యార్థులకు ఆదర్శమని ఇంటర్మీడియెట్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) సైమన్ విక్టర్ అన్నారు. భారతమాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉన్న కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్ఐఓ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో ఓ పేద కుటుంబంలో పుట్టి పేపర్‌బాయ్‌గా జీవితం ప్రారంభించి చదువుపై అమితాసక్తితో పేదరికాన్ని అధిగమించి విజ్ఞానాన్ని సంపాదించి శాస్త్రవేత్తగా రాణించడంతో పాటు రాష్ట్రపతిగా పనిచేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళీకృష్ణ, శిరీష, తిరుమలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయం



సబ్‌కలెక్టర్‌ను అభినందిస్తున్న నాగార్జున రెడ్డి

మార్కాపురం: విద్యార్థులు విద్యతోపాటు సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. శనివారం బోడపాడు రోడ్డులోని రాక్‌వెల్ స్కూల్‌లో స్టూడెంట్ క్యాబినెట్ ఓత్ కార్యక్రమం పాఠశాల డైరెక్టర్ వెన్న నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.1 నుంచి 9వ తరగతి విద్యార్థులు స్కూల్ కౌన్సిల్ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. సింధూజ, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి

మార్కాపురం టౌన్: స్థానిక కంభం రోడ్డులో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారిని అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐ

కొనకనమిట్ల: కొత్త చట్టాలు, న్యాయపరమైన అంశాలపై ఎస్ఐ మాధవరావు ప్రజలకు అవగాహన కలిపించారు. శనివారం గ్రామంలో పర్యటించి శాంతి భద్రతలపై చర్చించారు. అల్లర్లు సృష్టించి, గొడవలకు కారణమయ్యే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ధ్రువపత్రాలు లేకుండా నడిపే వాహనాలకు చలానా విధించారు.

ఘనంగా కోటి కుంకుమార్చన



ప్రత్యేక పూజల్లో కోటేశ్వరరావు దంపతులు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహంతో అంతా చల్లగా ఉండాలని కోరుతూ జరిగే ఈపూజలు శనివారంతో ముప్పై ఆరో రోజుకు చేరాయి. పునుగుపాటి కోటేశ్వరరావు దంపతులు ఉభయదాతలుగా వ్యహరించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఉభయదాతలను ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. పూజలు అనంతరం వారిని సత్కరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, పెరుమాళ్ళ భాస్కర్‌రావు, ఎస్.నాగేశ్వరరావు, రవి, సాయి, మేడా నరసింహారావు పాల్గొన్నారు.

ఆలయాల్లో పోటెత్తిన భక్తులు



అలంకరణలో శ్రీవారి ఉత్సవ మూర్తులు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తుల సందడి నెలకొంది. శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.